క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలో బుధవారం బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో 'చలో నిజామాబాద్' పోస్టర్లను ఆవిష్కరించారు. బహుజన మహనీయుల జయంతిని పురస్కరించుకుని ఈ నెల 16న చలో నిజామాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వేదిక సభ్యులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యాటప్రతాప్, ప్రధాన కార్యదర్శి సురేష్, గంగాధర్, శుభాకర్, లక్ష్మన్, వంశీ, శ్రీకాంత్, కళ్యాణ్, సాయన్న, భూమన్న నాని తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రాయితీలు ఇవ్వండి



నందిపేట్(ఆర్మూర్): రాయితీలు కార్పొరేటర్లకు కాకుండా పేదలకు ఇవ్వాలని పీవోడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో బుధవారం వారు ఆందోళన కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలకు 12 రకాల నిత్యావసర వస్తువులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కొత్త వారికి రేషన్ కార్డులను అందజేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా చేపట్టే ఆందోళనను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘ సభ్యులు లత, శోభ, గంగవ్వ, పూజ పాల్గొన్నారు.

మోదీ, బండి దిష్టిబొమ్మ దహనం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పీఎం మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా మోదీ, బండి సంజయ్ కుట్ర చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్ రెడ్డి, ఎంపీపీ పస్క నర్సయ్య పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ..



భీమ్‌గల్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడాన్ని నిరసిస్తూ బుధవారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో బుధవారం భీమ్‌గల్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ.. పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రశ్నించినందుకు శివసేనరెడ్డి, బల్మూరి వెంకట్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనమన్నారు. వారి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొదిరె స్వామి, జేజే నర్సయ్య, గోపాల్ నాయక్, అనంతరావ్, విక్రమ్ పాల్గొన్నారు.

ఆలయాలకు బియ్యం పంపిణీ



బోధన్‌రూరల్(బోధన్)/బోధన్: బోధన్ నియోజక వర్గంలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట, సాలూర మండలాల్లో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయాల వద్ద నిర్వహించే అన్నదానం కోసం ఎమ్మెల్యే షకీల్ 150 క్వింటాళ్ల బియ్యం వితరణ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వద్ద బుధవారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్ పర్యవేక్షణలో నాయకులు గ్రామాల వారీగా బియ్యం పంపిణీ చేశారు. ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ షకీల్, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

వరికోతలపై అవగాహన

వేల్పూర్: మండలంలోని మోతె గ్రామంలో యాసంగి వరికోతపై రైతులకు మండల వ్యవసాయాధికారి నర్సయ్య బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. హార్వెస్టర్ యంత్రంతో వరి పంట కోసేటప్పుడు తగిన స్పీడు ఉంచి తాలు గింజలు రాకుండా చూసుకోవాలన్నారు. ఎఫ్‌ఏక్యూ ప్రమాణాలతో వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలన్నారు. ఏఈవో షబ్బీర్ పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బుధవారం భారత తొలి దళిత ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సంఘాలు, పార్టీల నేతలు జగ్జీవన్ రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..బడుగు వర్గాల కోసం, సమ సమాజ స్థాపన కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశాజీవిగా ఆయన చరిత్రలో స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు. –సాక్షి నెట్‌వర్క్



మంగళపాడ్ గ్రామంలో..



దేగాం గ్రామంలో..



ఆర్మూర్ పట్టణంలో..



రుద్రూర్ మండల కేంద్రంలో..



వేల్పూర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, తదితరులు



బోధన్ పట్టణంలో..



కూనేపల్లి గ్రామంలో..



కోనాసముందర్‌లో..



సావెల్ గ్రామంలో..



వెల్మల్ గ్రామంలో..



ఆర్మూర్‌లో..



సోంపూర్ గ్రామంలో..



సాలూరగ్రామంలో..

సాటాపూర్‌లో 'బలగం' ప్రదర్శన



రెంజల్(బోధన్): తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానంతో పాటు కుటుంబ బాంధవ్యాలను కళ్ల ముందు కట్టి పడేసిన బలగం సినిమా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. దీంతో పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, గ్రామాభివృద్ధి కమిటీలు ప్రొజెక్టర్ల ద్వార సినిమా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎఖార్‌పాష మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయించారు. ప్రతీ గ్రామంలో సర్పంచ్‌లు ముందుకు వచ్చి బలగం సినిమాను ప్రజలందరు చూసి మునపటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు మార్పు దిశగా చర్యలు తీసుకునాలని సర్పంచ్ కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బోధన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రటించాలని డిమాండ్ చేస్తూ, జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 108వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, సంగం గంగాధర్‌గౌడ్ కూర్చున్నారు. బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు, న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ దీక్షలను ప్రారంబించారు. అనంతరం బాబు జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు.

మాదాపూర్ చెరువులోకి అలీసాగర్ నీళ్లు

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ చెరువులోకి బుధవారం నిజాంసాగర్ కెనాల్ ద్వారా అలీసాగర్ నీళ్లు వచ్చాయి. వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ నెల 3న మాదాపూర్‌లో రైతులు రోడెక్కి రాస్తారోకో చేపట్టారు. దీంతో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు స్పందించి మాదాపూర్ చెరువులోనికి నీటిని తెప్పించారు. తాను ఇచ్చిన హామీ కాకపోయినప్పటికీ రైతుల ఆవేదనను తట్టుకోలేక జిల్లా ఉన్నత అధికారులను కలిసి అలీసాగర్ నీటిని చెరువుకు మళ్లించినట్లు విఠల్‌రావు వెల్లడించారు. అనంతరం జెడ్పీ చైర్మన్, ఇరిగేషన్ అధికారులతో కలిసి మాదాపూర్ చెరువును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంటలు పూర్తిగా చేతికందే వరకు నీళ్లు చెరువుకు అందించాలని పక్కనే ఉన్న ఇరిగేషన్ ఈఈ కృష్ణమూర్తిని జెడ్పీచైర్మన్ ఆదేశించారు. రైతులు విఠల్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇరిగేషన్ ఏఈ దివ్యభారతి, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, విండో డైరెక్టర్ కాశీనాథ్‌రావు, మాజీ సర్పంచ్ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నూతన కార్యవర్గం ఎన్నిక

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా వాల్గొట్ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎల్లా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా జుంబరాత్ సత్యనారాయణ, కోశాధికారిగా జుంబరాత్ శంకర్, డైరెక్టర్లుగా రవితేజ, బాలకిషన్, విజయ్, రంజిత్, జనార్దన్ తదితరులు ఎన్నికయ్యారు.



పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణ ప్రజలు పండుగలను ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. హనుమాన్ జయంతి, రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలో విజయయాత్ర సాఫీగా సాగాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పోలీసుశాఖ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్‌ఐలు పీటర్, నవీన్‌కుమార్, నరేష్, గంగాప్రసాద్, ఇరు వర్గాలకు చెందిన పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో నరేంద్ర విద్యార్థుల ప్రతిభ



ఫ్రాస్త సుల్తానా



సానియా నాజ్



అనూహ్య



సమీరా ఫిర్దౌస్



సుమలత

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని నరేంద్ర మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు బుధవారం విడుదలైన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ సదాక్ కల్పన తెలిపారు. ఫ్రాస్త సుల్తానా బీఎస్సీ బీజెడ్సీ ఐదో సెమిస్టర్‌లో 9.68 గ్రేడ్, సానియా నాజ్ బీఎస్సీ కంప్యూటర్స్ ఐదో సెమిస్టర్‌లో 9.60 గ్రేడ్, అనూహ్య బీకాం కాస్ట్ అకౌంటింగ్ ఐదో సెమిస్టర్‌లో 9.20 గ్రేడ్, సమీరా ఫిర్దౌస్ బీఎస్సీ బీజెడ్సీ థర్డ్ సెమిస్టర్‌లో 9.72 గ్రేడ్, సుమలత బీకాం కాస్ట్ అకౌంటింగ్ థర్డ్ సెమిస్టర్‌లో 9.28 గ్రేడ్ సాధించినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా విద్యార్థినులను కళాశాల చైర్మన్ దాసరి శంకర్, ప్రిన్సిపల్ కల్పన అభినందించారు.

సమాచారం..

- రేపటి నుంచి ఉచిత దశదిన సంస్కృత సంభాషణ శిబిరం

బోధన్: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో సంస్కృత భారతీసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7నుంచి 16వరకు ఉచిత దశదిన సంస్కృత సంభాషణ శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ పట్టణ అధ్యక్షుడు పబ్బ మురళి, శిబిరం ప్రముఖ్ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. పన్నెండేళ్లు నిండిన బాలబాలికలు, పురుషులు, మహిళలు, కుల, మత వయోబేధం లేకుండా శిబిరంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 6281328259, 9346496587ను సంప్రందించాలని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం..

- పెద్దమ్మ ఆలయంలో మండల పూజ



నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలోని పలుగుట్ట పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో మండల పూజ నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

- అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ మందిరం ఆవరణలో గల అయ్యప్ప ఆలయంలో బుధవారం అఖిల భారతీయ అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్ రెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

- హనుమాన్ జయంతి వేడుకలకు ఆలయాల ముస్తాబు



బోధన్‌టౌన్(బోధన్): హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని పెద్ద మారుతి మందిరంతో పాటు వివిధ కాలనీల్లోగల హనుమాన్ మందిరాలను ముస్తాబు చేశారు. ఆయా ఆలయాల్లో గురువారం తెల్లవారు జామున నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే భజరంగ్‌దళ్, విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించనున్నారు.

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాలు హనుమాన్ జయంతి వేడుకలకు ముస్తాబయ్యాయి. అలాగే ఆలయాల వద్ద అన్నదానాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేశారు.

బండి సంజయ్ అరెస్టు అక్రమం





నందిపేటలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు.. ఆర్మూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అక్రమమని పార్టీ శ్రేణులు ఆరోపించారు. ఈమేరకు బీజేపీ నాయకులు బుధవారం అరెస్టుకు నిరసనగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసనలు తెలిపారు. పలు చోట్ల రాస్తారోకోలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అర్ధరాత్రి ఒక పార్లమెంట్ సభ్యుడిని ఎలాంటి వారెంట్ లేకుండా ఎలా అరెస్ట్ చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, ప్యాకేజీల విషయంలో బండి సంజయ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుండటంతో భయంతో అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కొన్ని రోజులుగా ప్రశ్నించే వారిని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని, సరైన పాలన చేతకాక టీఎస్పీఎస్సీ, పదో తరగతి పేపర్ల లీకేజీలకు కారణమవుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్నారని అన్నారు. కేసీఆర్ పాలన నిజాం పాలనను గుర్తు చేస్తుందని గుర్తు చేశారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు..

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలుచోట్ల బీజేపీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగుతారేమోనని పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. అలాగే పలుచోట్ల రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.



రుద్రూర్ మండల కేంద్రంలో



ముప్కాల్‌మండల కేంద్రంలో..





బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు.. మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో..

సంక్షిప్తం

బాడీ ఫ్రీజర్ వితరణ

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని ముస్లిం మైనార్టీ కమిటీ సభ్యులకు స్థానిక వార్డు సభ్యుడు మాన్పూర్ భూమేష్ శీతల శవపేటిక (బాడీ ఫ్రీజర్)ను వితరణ చేశారు. ఎంపీడీఓ నాగవర్దన్, ఎస్‌ఐలు, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మాక్లూర్: మండలంలోని ఒడ్డెట్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను బుధవారం సర్పంచ్ రామడోళ్ల సుధారాజేశ్వర్ ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్కొండ: ముప్కాల్‌లో సీసీ రోడ్డు పనులను బుధవారం ఎంపీపీ సామ పద్మ ప్రారంభించారు. సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఎంపీటీసీ నాయకుడు పద్మ,కోఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు అభినందన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్మూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జట్టు ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అండర్ –10 సాఫ్ట్‌బాల్ పోటీల్లో మొదటి స్థానంలో గెలుపొందింది. విజేత జట్టును ఉపాధ్యాయులు అభినందించారు.

పశువైద్య శిబిరం

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో బుధవారం వెటర్నరి శాఖ అధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు, చికిత్సలు నిర్వహించారు.

సెంట్రల్ లైటింగ్ కోసం స్థల పరిశీలన

రుద్రూర్: చందూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్ కోసం బుధవారం జెడ్పీ ఫ్లోర్ లీడర్, జెడ్పీటీసీ అంబర్ సింగ్ స్థల పరిశీలన చేశారు. వైస్ ఎంపీపీ దశగౌడ్, నాయకులు పోతరాజు శ్రీనివాస్, బాబు ఉన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక చేయూత

రుద్రూర్: కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్‌లో మొహమ్మద్ అస్లమ్ అనే దివ్యాంగుడికి బుధవారం రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్, డీసీసీ డెలిగేట్, యలమంచిలి శ్రీనివాస్‌రావు రూ.10వేల ఆర్థిక సహాయం అందచేశారు. మాజీ సర్పంచ్ మీరాసాబ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



నవీపేట: మండలకేంద్రంలో ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు బుధవారం జనవికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్, పెన్నులను అందజేశారు. సమితి ప్రతినిధులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాక్లూర్: మండలంలోని ఢీకంపల్లి ఎంపీటీసీ కాలగడ్డ గంగమణి దేవన్న కుమారుడు రంజిత్ (30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం జెడ్పీచైర్మన్ విఠల్‌రావు పరామర్శించారు.